గుంతల చింత తీరేదెన్నడో..?

- అధ్వానంగా ముప్కాల్ – మెండోరా రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహన చోదకులు



రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిండిన వర్షపు నీరు

బాల్కొండ: ముప్కాల్ నుంచి మెండోరా మండల కేంద్రం వరకు నిర్మించిన తారు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ కారణంగా ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల మధ్య కొత్తగా బీటీ రోడ్డు నిర్మించాలని 2017లో ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. అదే సంవత్సరం పనులను కూడా పూర్తి చేసింది. పనులు పూర్తయినప్పటి నుంచే రోడ్డు గుంతలమయంగా మారింది. మాజీ సీఎం కేసీఆర్ శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం శంకుస్థాపనకు రావడంతో జాతీయ రహదారి–44పై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ట్రాఫిక్‌ను మళ్లిస్తూ ఈ రోడ్డు గుండా పెద్ద పెద్ద వాహనాలను తరలించారు. దీంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. తరువాత రోడ్డుకు స్వల్ప మరమ్మతులు చేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు. అప్పటి నుంచి రోడ్డు అడుగు తీసి అడుగు వేయలేనంతగా గుంతలు ఏర్పడుతున్నాయి. మరమ్మతుల కోసం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో వర్షపు నీరు భారీగా నిలుస్తోంది. అంతే కాకుండా ప్రయాణికులకు వర్షపు నీరు వల్ల గుంతలు ఏర్పడక ప్రమాదాలకు గురవుతున్నారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు మరమ్మతుల కోసం నిధులను మంజూరు చేసింది. కాని ఇప్పటికీ ఎలాంటి పనులు ప్రారంభించలేదు. మండల కేంద్రానికి నిత్యం వెళ్లే అధికారులు నరకాన్ని చూస్తున్నారు. పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో నిర్మించిన రోడ్డు కావడం వల్ల సంబంధిత అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రోడ్డు గుండా వెళ్తూనే 2018లో ఘోర ప్రమాదం సంభవించింది. ఆటో బావిలో పడి 11 మంది మత్యువాత పడింది ఈ రోడ్డు గుండా ప్రయాణం చేసే. ఉన్నత అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని ప్రయాణికులు, మెండోరా మండల కేంద్రంలో విధులు నిర్వహించే ఉద్యోగులు వేడుకుంటున్నారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి రూ.50 వేల సాయం



మోర్తాడ్: తాటిచెట్టుపై నుంచి పడి మరణించిన ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌కు చెందిన బోదాసు గంగాధర్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని మన ఊరు–మన బడి యూఏఈ ఎన్ఆర్ఐల బృందం మంగళవారం అందించారు. మృతుడికి భార్య కుమారుడితో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న మరో ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ఎన్ఆర్ఐ ప్రతినిధులు ప్రకటించారు. కార్యక్రమంలో శ్యాంసుందర్‌గౌడ్, సృజన్ బండి, దేవేందర్ బోదాసు, ప్రతాప్ ముదిరాజ్ ఆడెం, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పడకల్‌లో మరొకరికి..



పెర్కిట్(ఆర్మూర్): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై బ్రెయిన్ డెడ్ అయిన జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ షరీఫ్ కుటుంబానికి ఏఐటీయూసీ నాయకులు మంగళవారం రూ.23 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. డ్రైవర్ షరీఫ్ ఈ నెల 26న వాకింగ్ చేస్తుండగా బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో షరీఫ్ బ్రెయిన్ డెడ్ అయింది. ప్రస్తుతం షరీఫ్ పెర్కిట్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో మామిడిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యాలయంలో నాయకుడు ఆరేపల్లి సాయిలు ఆధ్వర్యంలో షరీఫ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు బక్కన్న, మాదరి నరేష్, రమేష్, శ్రీను, ముప్పారం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వర్ని ఎంఈవోగా నాగనాథ్



వర్ని: ఉమ్మడి వర్ని మండల విద్యాశాఖ అధికారిగా నాగరాజు మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు వర్ని ఎంఈవోగా పనిచేసిన శాంతకుమారి పదవీ విరమణ చేయడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు నాగరాజును ఎంఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన తన పదవీ బాధ్యతలను చేపట్టారు. వర్ని, రుద్రూర్, చందూర్, మోస్రా మండలాలతో పాటు కోటగిరి, పోతంగల్, సాలూర, బోధన్ మండలాలకు నాగరాజు ఎంఈవోగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

ప్రిన్సిపల్ బదిలీ

డొంకేశ్వర్(ఆర్మూర్): నూత్‌పల్లి బీసీ బాలుర గురుకులం ప్రిన్సిపల్ సంతోష్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయన కరీంనగర్‌కు బదిలీ కాగా మంగళవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. కొత్త ప్రిన్సిపల్‌గా లక్ష్మణ్ పదోన్నతిపై వచ్చారు. బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపల్‌తో పాటు బోధన సిబ్బందికి వీడ్కోలు పలికారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాం

ఆర్మూర్‌టౌన్: వైద్యారోగ్య సిబ్బంది అర్హులైన దంపతులకు కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో తుకారాం సూచించారు. ఈ నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ..పురుషుల కోసం ఈ నెల 11 నుంచి 24వ తేదీల మధ్య జిలాలో ఐదు కుటుంబ నియంత్రణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమం విజయవంతం చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, డీఐవో అశోక్, వైద్యులు లావణ్య, వినీత్, వెంకటేశ్వర్లు, విశాల, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



రెంజల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు

రెంజల్(బోధన్): సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డివిజినల్ సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్‌రావ్ మండలంలోని ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి సూచించారు. జులై నెలను డెంగీ నెలగా పరిగణించిన సందర్భంగా మంగళవారం రెంజల్ పీహెచ్‌సీ నుంచి గాంధీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో ఎక్కువ రోజులు నీటి నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. వాటి వల్ల దోమలు తయారవుతాయని, మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు మొదలగు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి శ్రావణ్‌కుమార్, రాణీ, మౌలాన్‌బీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి



మున్సిపల్ అధికారులతో సమావేశమైన జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్

ఆర్మూర్‌టౌన్: డెంగీతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైందని, దీంతో డెంగీ వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. మున్సిపల్ అధికారులు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది సైతం ఇంటింటి తిరుగుతూ ప్రజలకు వ్యాధుల గురించి వివరించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, మున్సిపల్ కమిషనర్ రాజు, సానిటరి ఎస్సై మహేష్ పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఆర్మూర్‌టౌన్: తెలంగాణలో పండే అన్ని పంటలకు మద్దతు ధరలను నిర్ణయించి, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్ కోరారు. ఆర్మూర్ తహసీల్ కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 14 పంటలకు మద్దతు ధరలను పెంచి గత ఏడాది నిర్ణయించిన ధరలపై ఐదు నుంచి ఏడు శాతం మాత్రమే పెంచారన్నారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు 20 నుంచి 22 శాతం పెరిగాయని, రైతులకు మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎరువులన్నీ అందుబాటులో ఉంచాలని, ముందస్తు ప్రణాళిక ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తోగటి భువనేశ్వర్, నాయకులు చల్ల గణేష్, గంగారం, నవీన్, జయ తదితరులు పాల్గొన్నారు.

వరి క్వింటాలుకు రూ.3,012 చెల్లించాలి



నవీపేట: వరి ధాన్యం క్వింటాలుకు రూ.3,012 చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం మండల నాయకులు మంగళవారం తహసీల్దార్ నారాయణకు వినతి పత్రం సమర్పించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు రూ. 2,300లు కాకుండా పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయించిన ధరను చెల్లించాలని కోరారు. విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటు ధరలో ఉంచాలని కోరారు. నాయకులు దేవేందర్‌సింగ్, కిషన్, రాంసింగ్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నిక ఏకగ్రీవం



సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం పట్టణంలోని సంఘ భవనంలో అధ్యక్షుడిగా కన్నోజువార్ ప్రభాకర్‌చారి, ప్రధాన కార్యదర్శిగా కుందనం రమేష్‌చారి, కోశాధికారిగా నారోజు వెంకటరమణచారి, మిగతా సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం వ్యవస్థాపకులు కోరుట్ల రామదాస్‌చారి, సంఘ నాయకులు రామోజు నాగభూషణం చారి, మారోజు సుధాకర్ చారి, కత్రోజ్ కాళిదాసు చారి, స్వర్ణకార సంఘం అధ్యక్షులు పాదోజువార్ జనార్దన్ చారి, మనమయ సంఘం అధ్యక్షుడు పాంచాల్ లక్ష్మణ్ చారి, వడ్ల గంగాధర్ చారి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను ఆదుకోవాలి



నవీపేట: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను ఆదుకోవాలని కోరుతూ బీజేవైఎం మండల నాయకులు మంగళవారం తహసీల్దార్ నారాయణకు వినతి పత్రం సమర్పించారు. గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్–2,3 నోటిఫికేషన్‌లో అదనంగా పోస్టులను పెంచాలని, 25 వేల పోస్టుల భర్తీ లక్ష్యంగా డీఎస్సీని ప్రకటించాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేవైఎం నాయకులు పిల్లి శ్రీకాంత్, రాజశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సఖీ కేంద్రం నిర్వాహకులు భాను ప్రియ

రుద్రూర్: అంబం(ఆర్) శివారులోని మోడల్ స్కూల్‌లో మంగళవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కేంద్రం ప్రతినిధులు మాట్లాడుతూ.. బాలికలు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. భారతీయ న్యాయ సంహిత చట్టాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సఖీ, షీటీంలను సంప్రదించాలని సూచించారు. సఖీ కేంద్రం నిర్వాహకురాలు భాను ప్రియ, జిల్లా కో–ఆర్డినేటర్ స్వప్న, మహిళా సాధికారత కేంద్రం సభ్యులు కవిత, పుష్ప, కళాశాల ప్రిన్సిపాల్ ఆలూరి నరేందర్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామంలో స్థానిక రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. ఈ టోర్నీలో ప్రథమ స్థానంలో మెండోరా, ద్వితీయ స్థానంలో నాగంపేట్ గ్రామాల జట్లు నిలిచాయి. ఆ జట్లకు కప్‌లతోపాటు నగదును అందజేశారు. నిర్వాహకులు మేడిపల్లి ముత్యంరెడ్డి, మోహన్‌రెడ్డి, సతీష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

బాల్కొండ: ముప్కాల్ మండల పరిధిలో పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంపీపీ సామ పద్మ చేతుల మీదుగా అందజేశారు. తహసీల్దార్ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాలా కన్వర్షన్ రద్దు చేయాలి



సుభాష్‌నగర్: డొంకేశ్వర్ మండలంలోని దత్తాపూర్ గ్రామ పెద్ద చెరువు కబ్జా చేసి రైస్‌మిల్ నిర్మాణం చేపడుతున్నారని, వెంటనే నాలా కన్వర్షన్ రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు కలెక్టరేట్‌కు తరలి వచ్చి ఏఓ ప్రశాంత్‌కుమార్‌కు, సర్వే ఏడీకి వినతి పత్రాలు అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. చెరువు కబ్జాకు గురైందని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో సర్వేయర్ సర్వే నిర్వహించారని, ఆ సర్వేపై అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. సరైన హద్దులు చూపించలేదని, వెంటనే రీసర్వే నిర్వహించి చెరువును కాపాడాలని కోరారు.

సొసైటీ మహాజన సభ



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ సహకార సొసైటీ ప్రత్యేక మహాజన సభ మంగళవారం సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్ వసంత ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసాపై సలహాలు, సూచనలు తీసుకున్నారు. అనంతరం సొసైటీ ద్వారా చేపట్టిన పనులు, రుణాలు, ధాన్యం కొనుగోళ్లపై చర్చించారు. మహిళా రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేకంగా రుణాలు అందజేస్తామని సొసైటీ చైర్మన్ భరత్‌రాజ్ రెడ్డి తెలిపారు. సొసైటీ వైస్ చైర్మన్ మోర్తాడ్ ముత్యం, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భూమేశ్ రెడ్డి పాల్గొన్నారు.

ఉషోదయ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని సన్మానిస్తున్న డైరెక్టర్, అధ్యాపకులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో ఎంపీసీఎస్ కోర్సును పూర్తి చేసిన కులకర్ణి వేణుగోపాల్ ఎడ్‌సెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి సత్తా చాటాడని ఉషోదయ కళాశాల డైరెక్టర్ దుష్యంత్ అన్నారు. మంగళవారం కళాశాలలో వేణుగోపాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మాట్లాడారు. 2024 విద్యా సంవత్సరం ఎడ్‌సెట్ పాత పరీక్షలో 67వ ర్యాంకును సాధించాడని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



భీమ్‌గల్: పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ అన్నారు. మండలంలోని బాబాపూర్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను గ్రామ పంచాయతీ సెక్రెటరీతో కలసి ఎంపీడీవో సంతోష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేయాలని, రోడ్లపై ప్లాస్టిక్ లేకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరించాలని సూచించారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

- ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలకు ఘనంగా సన్మానం, వీడ్కోలు



బోధన్‌లో ఎంపీపీ బుద్దె సావిత్రి, జెడ్పీటీసీ లక్ష్మీలను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బోధన్‌రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుద్దె సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదా సాగింది. ఉమ్మడి మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధిపై అధికారులు, సభ్యులకు వివరాలను తెలియజేశారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులపై అధికారులు పారదర్శకతతో వ్యవహరించాలని ఎంపీపీ బుద్దె సావిత్రి సూచించారు. నేటితో (బుధవారం)తో ఎంపీటీసీ పదవీ కాలం ముగుస్తుండటంతో ఎంపీపీ బుద్దె సావిత్రి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ అధికారులను శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించి మెమోంటోలను అందజేశారు. ఎంపీపీ బుద్దె సావిత్రి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, జడ్పీటీసీ లక్ష్మీ, ఎంపీడీవో శ్రీనివాస్, ఎమ్మార్వో గంగాధర్, సీడీపీవో జానకి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గిర్దావర్ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో..



భీమ్‌గల్‌లో ఎంపీటీసీలకు సన్మానం

భీమ్‌గల్: ఎంపీపీ ఆర్మూర్ మహేష్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఎంపీడీవో సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం నిర్వహించారు. జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్కొండలో..



బాల్కొండ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్ తదితరులు

బాల్కొండ: బాల్కొండ మండల పరిషత్ పాలకవర్గం పదవీ కాలం ముగియనుండడంతో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో పాలకవర్గం చేపట్టిన అభివృద్ధి పనుల గురించి కొనియాడారు. అనంతరం పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో ఉంటాం



నందిపేటలో ..

నందిపేట్(ఆర్మూర్): పదవిలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల సేవలో ఉంటామని ఎంపీపీ వాకిడి సంతోష్ రెడ్డి అన్నారు. ఎంపీటీసీల కాలం ముగియనున్న సందర్భంగా మంగళవారం నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. సభ్యులు చేసిన సేవలను కొనియాడారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆనంద్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోవింద్‌పేట్ ఎంపీటీసీ రాజ్‌కుమార్‌కు..



గోవింద్‌పేట్ ఎంపీటీసీ, మాజీ ఉప సర్పంచ్‌లను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ ఎంపీటీసీ యాల్ల రాజ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ బండమీది గంగాధర్‌ను స్థానిక నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ పదవీ కాలంల ఈ నెల 4వ తేదీన ముగుస్తుంది. దీంతో జీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీతో పాటు మాజీ ఉప సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు. సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్, జీపీ కార్యదర్శి సుకన్య, హెచ్ఎంలు ఇందిర, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

■ నేడు రైతు భరోసాపై ప్రత్యేక సమావేశం

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని విశాల సహకార సంఘం రైతు భరోసా పథకానికి సంబంధించి సలహాలు, సూచనల కోసం బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు విండో కార్యదర్శి భరత్ తెలిపారు. రైస్ మిల్లు ఆవరణలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సంఘ అధ్యక్షుడు శాంతీశ్వర్ పటేల్ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందని, సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వైద్యపరీక్షలు



ట్రాన్స్‌కో కార్యాలయంలో వైద్య పరీక్షలను ప్రారంభిస్తున్న డీఈ హరిచంద్‌నాయక్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఆర్మూర్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. యశోద ఆస్పత్రి డాక్టర్లు ట్రాన్స్‌కో డీఈ హరిచంద్ నాయక్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బందికి బీపీ, షుగర్, గుండె తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు సత్య సుదిష్, కార్డియాలజిస్ట్ వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – కల్కి ఏడీ-2898 (తెలుగు) - 9.30, 4.15, 11.00 మహారాజ (తెలుగు) - 1.15, 8.00
- స్క్రీన్-2 – కల్కి ఏడీ-2898 (3డీ తెలుగు) - 8.00, 11.45, 3.30, 7.15, 11.00
- స్క్రీన్-3 – కల్కి ఏడీ-2898 (తెలుగు) - 10.05, 1.50, 5.35, 9.20
- స్క్రీన్-4 – కల్కి-2898 (తెలుగు) - 11.05, 2.50, 6.35, 10.20

ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గంగాధర్



మాక్లూర్: అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఒడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన దుడ్డు గంగాధర్ నియమితులైనట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ మంగళవారం తెలిపారు. జూన్ 30న మహబూబాబాద్‌లో జరిగిన రాష్ట్ర సదస్సులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా అందులో నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ఒడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన దుడ్డు గంగాధర్‌కు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చోటు దక్కిందన్నారు. గతంలో ఆయన కార్మిక, రైతుల పక్షాన ఎన్నో ప్రజాస్వామ్యయుత పోరాటాలు చేసి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని అన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలి

రుద్రూర్: దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టినట్టు మండల వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు జల్లపురం సాయిలు తెలిపారు. పెంచిన ఆసరా పింఛన్ల అమలు, తదితర డిమాండ్లను సాధించుకునేందుకు మండలంలోని దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరు కావాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.